సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



ఉపాధి కల్పనలో నంబర్ వన్

సీడాప్, డీడీయూలో శిక్షణ పొందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఏరీనాలో ఘనంగా జరిగింది. 8లో



వృత్తి మెకానిజం..

బైక్‌లపై వెళ్తూ మహిళల మెడలోని బంగారు చైన్లు తెంపుకుపోతున్న వ్యక్తిని ఆరిలోవ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. 8లో

కమాండర్ హ్యాపీమోహన్ ఐఎన్ఎస్ సర్కార్ బాధ్యతల స్వీకరణ



సింథియా: ఐఎన్ఎస్ సర్కార్ కమాండ్ బాధ్యతలను గురువారం కమాండర్ హ్యాపీ మోహన్ కమాండర్ ఆదిత్యసింగ్ దద్వాల్ నుంచి స్వీకరించారు. సెరిమోనియల్ డివిజన్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

న్యూస్‌రీల్

7న ఏపీఎంఈఎస్ఏ తొలి మహాసభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వేంకటేశ్వర్లు, నాయకులు

డాబాగార్డెన్స్: ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఎంఈఎస్ఏ) తొలి మహాసభ జనవరి 7న గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్టు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వేంకటేశ్వర్లు తెలిపారు. జీవీఎంసీలో గల అసోసియేషన్ కార్యాలయంలో గురువారం మహాసభ పోస్టర్‌ను వీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు, ఏపీఎంఈఎస్ఏ అధ్యక్షుడు దొప్పలపూడి ఈశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా ఇప్పటికీ సర్వీస్ రూల్స్ విషయంలో ప్రభుత్వాలు మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. పదోన్నతుల విషయంలో ఇక్కట్లు తప్పడం లేదన్నారు. జనవరి 7న విశాఖలో నిర్వహించనున్న అసోసియేషన్ తొలి మహాసభకు ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడి నర్సింగరావు, నాగేశ్వరరావు, గొండు సీతారామ్, అప్పలరాజు, పీతల వేంకటేశ్వరరావు, బిర్లంగి శంకర్రావు, అడపా అప్పలనాయుడు, సన్నీ, పి.పద్మజ, శ్రీనుబాబు, మంగరాజు, శివ, గణపతి, రాజేష్, శ్రీనివాసరావు, వీరబాబు, అప్పలరాజు, పోలారావు పాల్గొన్నారు.

గ్రూప్-2 ఉచిత శిక్షణ దరఖాస్తుకు నేడు గడువు

ఎంవీపీ కాలనీ: స్థానిక సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులకు ప్రిలిమినరీ పరీక్షలపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రూప్-2 శిక్షణ దరఖాస్తులకు శుక్రవారం సాయంత్రంతో గడువు ముగియనుంది. డిగ్రీలో మార్కులు ఆధారంగా మెరిట్ నిర్ణయించి 40 మందిని ఎంపిక చేయనున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. గ్రూప్-1 అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ వరకు గడువు ఉంది. శిక్షణకు 60 మందిని ఎంపిక చేయనున్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఎంవీపీ కాలనీలోని స్టడీ సర్కిల్‌లో అందజేయనున్నారు. వివరాలకు 0891-2564346, 9492569177 నంబర్లలో సంప్రదించవచ్చు.

విశాఖలో ఇన్వెస్టర్స్ సర్వీస్ సెంటర్

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలోని సెక్యూరిటీస్ మార్కెట్ ఇన్వెస్టర్ల అవసరాలను తీర్చేందుకు సెబీతో పాటు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజీలు కలిసి నగరంలో 'ఇన్వెస్టర్ సర్వీస్ సెంటర్'ని గురువారం ప్రారంభించాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ నిర్వహించే ఈ సెంటర్ కార్యకలాపాలను సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్వీ మురళీధర్ రావు, ఎన్ఎస్ఈ లిస్టింగ్ ఇన్వెస్టర్స్ కంప్లయిన్స్ చీఫ్ రెగ్యులేటరీ అధికారి అంకిత్ శర్మ, రీజనల్ రెగ్యులేటరీ సంతోష్ మోహన్‌దాస్ ప్రారంభించారు. సెక్యూరిటీల మార్కెట్‌లో లిస్టెడ్ కార్పొరేట్ సంస్థలు, ఇతర నమోదిత మధ్యవర్తులకు సంబంధించిన పెట్టుబడిదారుల ఫిర్యాదుల పరిష్కారాన్ని ఈ సెంటర్ సులభతరం చేస్తుందని మురళీధర్‌రావు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాల నిర్వహణకు కూడా కేంద్రం దోహదపడుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెబీ, బీఎస్ఈ ప్రతినిధులు పాల్గొన్నారు.

జగమంత సంబరం

సేవా కార్యక్రమాలతో ఘనంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు

సాక్షి, విశాఖపట్నం: సంక్షేమ రథ సారథికి విశాఖ జిల్లా సామాజిక సేవా కార్యక్రమాలతో పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పింది. ఊరూవాడా ఏకమై సంబరం చేసుకుంది. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు కేక్‌లు కట్ చేసి.. ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో పూజలు చేశారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఇలా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించి.. జననేతపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.



విశాఖ తూర్పు: 19వ వార్డు జాలరిపేటలో చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ ఎంవీవీ



విశాఖ ఉత్తర: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో మహిళలకు చీరలు అందజేస్తున్న కె.కె.రాజు



విశాఖ దక్షిణ: పూర్ణామార్కెట్ కూడలిలో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



గాజువాక: పెదగంట్యాడ జంక్షన్‌లో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



భీమిలి: క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



పెందుర్తి: వేపగుంటలో పేదలకు వస్త్రదానం చేస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



విశాఖ పశ్చిమ: 90వ వార్డులో రోడ్ల పక్కన నిద్రిస్తున్న వారికి దుప్పట్లు అందజేస్తున్న నమ్మి శ్రీను

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మేయర్ హరి వెంకట కుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో పర్యటన నిమిత్తం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. గురువారం ఉదయం 10.18 గంటలకు విమానంలో విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు మేయర్ గొలగాని హరివెంకట కుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్ రాజ్, గొల్ల బాబూరావు, యు.వి.రమణమూర్తిరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ ఆనందరెడ్డి, సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్ప గుచ్ఛాలు అందజేసి.. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 10.38 గంటలకు సీఎం జగన్ ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో చింతపల్లి బయలుదేరారు.



సీఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ విశ్వనాథన్

అక్కడ పర్యటన ముగించుకుని తిరిగి సాయంత్రం 4.05 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సీఎం జగన్‌కు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

ఘనంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు



చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ నాయకులు

కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు.. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు చీరల పంపిణీ చేశారు. ఎండాడలోని అంధుల పాఠశాలలో అల్పాహారం ఏర్పాటు చేశారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పిల్లా సుజాత, పేర్ల విజయ్‌చందర్, పార్టీ నాయకులు చొక్కాకుల వెంకట్రావు, జోనల్ ఇన్‌చార్జిలు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు ముత్తంశెట్టి శివ నందీష్, రాజబాబు, చంద్రశేఖర్, ఆళ్ల శివగణేష్, ముదుండి రాజేశ్వరి, శివరామకృష్ణ, కృపాజ్యోతి, ఈశ్వరరావు, కె.వి.బాబా, మన్యాల శ్రీనివాస్, పోతిన శ్రీనివాస్, పోతిన హనుమంతు, పిల్లా సూరిబాబు, కోడూరి సుశీల తదితరులు పాల్గొన్నారు.

జయహో జగన్

కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం రుషికొండలోని గీతం యూనివర్సిటీ నుంచి పార్క్ హోటల్ వద్ద గల వైఎస్సార్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ ఆధ్వర్యంలో సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, వీఎంఆర్డీఏ పార్కు మీదుగా పార్క్ హోటల్ కూడలికి చేరుకున్నారు. అక్కడ వైఎస్ విగ్రహం వద్ద భారీ కేక్ కట్ చేశారు. రాష్ట్ర యువజన విభాగం నాయకులు లొడగల రామ్మోహన్, భీశెట్టి ప్రదీప్, లిఖిత్, భార్గవ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. గీతం యాజమాన్యం బైక్ ర్యాలీ నిర్వహించకుండా ఆటంకాలు సృష్టించినప్పటికీ.. విద్యార్థులు మాత్రం స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొన్నారు.



ఉత్సాహంగా సాగిన బైక్ ర్యాలీ

కిరణ్ కృష్ణ ఎండీపై అట్రాసిటీ కేసు

విశాఖ సిటీ: కిరణ్ కృష్ణ రియల్ ఎస్టేట్ మేనేజింగ్ డైరెక్టర్ వల్లభనేని కృష్ణ ప్రసాద్‌పై ఆనందపురం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ రఘు 30 క్రితం కిరణ్ కృష్ణ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి ఆనందపురం మండలంలో స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటివరకు ఆ స్థలాన్ని చూపించకుండా సంస్థ ప్రతినిధులు తప్పించుకొని తిరుగుతున్నారు. దీనిపై 2008లో రఘు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డాక్యుమెంట్‌లో తప్పులు ఉన్నాయని వాటిని సరిచేయాలని చెప్పి సవరణ రిజిస్ట్రేషన్ చేశారు. అయినా స్థలాన్ని చూపించకపోవడంతో రఘు ఆనందపురం పోలీసులతో పాటు సబ్ రిజిస్ట్రార్‌కి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రఘు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సంస్థ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్‌కు ఫోన్ చేశారు. స్థలం విషయం అడగ్గా కృష్ణప్రసాద్ కులం పేరుతో రఘుని దూషించారు. దీంతో ఆయన ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కృష్ణ ప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

సంస్కరణలతో ఉత్తమ ఫలితాలు

- విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం
- జిల్లాలో 10,562 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు మంజూరు: కలెక్టర్ మల్లికార్జున



హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

విశాఖ విద్య: 'విద్యార్థుల బంగారు భవిష్యత్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టింది. తద్వారా ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయి. ఇందుకు మీరే సాక్ష్యం' అని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున విద్యార్థులనుద్దేశించి అన్నారు. రైల్వే న్యూకాలనీ పరిధిలోని కె.ఎస్.ఎం.(కమలా నెహ్రూ) బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌తో కలసి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల పిల్లలు చదువుకు దూరం కాకూడదనే సదాశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు, ఆధునిక విషయాలను తెలుసుకునేందుకు ట్యాబ్‌లు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజన పథకం, బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక నిధులు, కల్పిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకుని విద్యార్థులు తమ ఆశయాలను నెరవేర్చుకోవాలని సూచించారు. కాగా.. రెండో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 8వ తరగతి చదువుతున్న 10,562 మందికి ట్యాబ్‌లు మంజూరయ్యాయి. బైజూస్ కంటెంట్‌తో కూడిన ఒక్కో ట్యాబ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.32,088 చొప్పున రూ.33.89 కోట్లు వెచ్చించింది. రెండు విద్యా సంవత్సరాలకు కలిపి రూ.73.48 కోట్లు ఖర్చు చేసినట్లు కలెక్టర్ చెప్పారు.

చంద్రబాబు విషప్రచారం మానుకోవాలి

ట్యాబ్‌లు వినియోగంతో పేద విద్యార్థులు చదువుల్లో రాణిస్తుంటే.. దీనిపై కూడా చంద్రబాబు, ఈనాడు పత్రిక విషప్రచారం చేస్తుండటం సిగ్గుచేటని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. కళ్లు ఉండి కూడా చూడలేని గుడ్డి వాళ్లుగా వ్యవహరిస్తున్నారని.. వీరికి ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. విద్యార్థులు లక్ష్యసాధనలో అవాంతరాలు అధిగమించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. డీఈవో చంద్రకళ జిల్లాకు కేటాయించిన ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలు వంటి వాటిపై వివరించారు. నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ. షరీఫ్, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ట్యాబ్‌తో ఎంతో ఉపయోగం ఉంది



నేను 9వ తరగతి చదువుతున్నాను. గత సంవత్సరం నాకు ట్యాబ్ ఇచ్చారు. బైజూస్ కంటెంట్‌తో ఇచ్చిన ట్యాబ్‌లో పాఠ్యాంశాలను చదువుకునేందుకు ఎంతో బాగుంది. క్లాసులో విన్న పాఠాలు తిరిగి ఇంటి వద్ద ట్యాబ్‌లో మరోసారి వినే అవకాశం ఉంది. చదువులో రాణించేందుకు ట్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి.

– జీవీసీ ప్రీతి, చిట్టివలస ఉన్నత పాఠశాల

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడికి వచ్చేశాం



నేను 9వ తరగతి చదువుతున్నాను. తమ్ముడు, నేను ఇంతకు ముందు ప్రైవేట్ స్కూలులో చదువుకున్నాం. అమ్మ ఒడి, విద్యా కానుక, మంచి భోజనంతో పాటు ఇంగ్లిష్ మీడియం చదువులు చెబుతుండటంతో ప్రైవేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ బడికి వచ్చేశాం. గతేడాది నాకు ట్యాబ్ ఇచ్చారు.

– యాదగిరి వర్షిణి, జీవీఎంసీ స్కూల్, రైల్వే న్యూ కాలనీ

చాలా సంతోషంగా ఉంది



నేను 8వ తరగతి చదువుతున్నాను. ట్యాబ్ ఇస్తున్నారని చెబితే అమ్మను తీసుకొని బడికి వచ్చాను. అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి. మా బడిలో నాకు యూనిఫాంలు, పుస్తకాలు అన్నీ ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడేమో ట్యాబ్ ఇస్తున్నారు. ఇంట్లో ట్యాబ్ కొనుక్కునే పరిస్థితి లేదు. ట్యాబ్ ఉపయోగించుకుని మరింత నాలెడ్జ్ పెంచుకుంటా..

– బత్తుల దీక్షిత, రైల్వే కాలనీ స్కూల్

ఏసీబీకి చిక్కిన హెడ్ కానిస్టేబుల్

- ఓ కేసు సెటిల్‌మెంట్‌లో రూ.5వేలకు ఒప్పందం
- డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఏసీపీతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ శ్రావణి



హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఓ హెడ్ కానిస్టేబుల్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు గురువారం చిక్కాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... అజీమాబాద్‌కు చెందిన భాషాకు హుస్సేన్, రసూల్ ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు హుస్సేన్ అనకాపల్లిలో ఉంటున్నాడు. ఒక విషయంలో వివాదం చెలరేగడంతో తండ్రి, పెద్ద కొడుకు హుస్సేన్ ఈ నెల 5న ఘర్షణ పడ్డారు. దీంతో వీరిద్దరూ గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ కేసును హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్‌కు ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ కేసు విషయమై భాషా చిన్న కుమారుడు రసూల్ హెడ్ కానిస్టేబుల్ వద్దకు ఇటీవల వచ్చి గొడవను పెద్దది చేయకుండా సెటిల్ చేయాలని కోరగా... అందుకు రూ.10 వేలు ఇవ్వాలని రాజశేఖర్ డిమాండ్ చేశాడు. చివరకు రూ.5 వేలు ఇచ్చేందుకు రసూల్ అంగీకరించాడు. అనంతరం రసూల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారు పక్కాగా వ్యూహరచన చేశారు. రసూల్ గాజువాక పోలీస్ స్టేషన్ ఆవరణలోని ఒక ఆటోలో రూ.5 వేలు పెట్టడంతో... ఆ డబ్బులు హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ తీస్తుండగా ఏసీబీ అడిషనల్ ఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం గాజువాక పోలీస్ స్టేషన్‌లో పలు ఫైళ్లను ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గాజువాక ఎస్ఐ ఎల్.భాస్కరరావు, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ నుంచి వివరాలు సేకరించారు. గతంలో రాజశేఖర్ రైటర్‌గా పనిచేశారు. గురువారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు.

ఇండస్ ఆస్పత్రికి షోకాజ్ నోటీసు

- ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే అగ్ని ప్రమాదమని నిర్ధారణ
- నోటీసు జారీ చేసిన డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ఇండస్ ఆస్పత్రికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆస్పత్రి నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే అగ్ని ప్రమాదం జరిగినట్లు విచారణ కమిటీ నిర్ధారణకు వచ్చింది. దీంతో ఆస్పత్రి లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 14వ తేదీన జగదాంబ జంక్షన్ ప్రాంతంలో ఉన్న ఇండస్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అధికార యంత్రాంగం హుటాహుటిన స్పందించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 47 మంది రోగులను వేరే ఆస్పత్రులకు తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టాలని కలెక్టర్ మల్లికార్జున సంబంధిత శాఖలకు చెందిన అయిదుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. విశాఖ ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిషోర్, జిల్లా అగ్ని మాపక శాఖాధికారి రేణుకయ్య, ఈస్ట్ ఏసీపీ మూర్తిలతో కూడిన కమిటీ ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టింది. ఇందులో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదానికి జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. ఆస్పత్రిలో పాత ఎలక్ట్రికల్ వైరింగ్ కారణంగానే షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగడం, అలాగే ఆస్పత్రి రెండో అంతస్తులో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో మండే స్వభావం గల నైట్రస్ ఆక్సైడ్ లీక్ అవడంతో మంటలు, దట్టమైన పొగ సంభవించినట్టు తేలింది. దీనిపై కమిటీ నివేదిక తయారు చేసి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు సమర్పించారు. దీనిపై డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు గురువారం ఇండస్ ఆస్పత్రికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఆస్పత్రిని ఎందుకు సీజ్ చేయకూడదో వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

క్లుప్తంగా

నాస్తికోద్యమ నేత జయగోపాల్‌కు అస్వస్థత

మహారాణిపేట: ప్రముఖ నాస్తిక ఉద్యమనేత, మూఢ నమ్మకాల నిర్మూలనకు ప్రజల్లో శాస్త్రీయ అవగాహన, అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కుల పరిరక్షణ కోసం విశేష కృషి చేసిన డాక్టర్ జయగోపాల్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఊపిరితిత్తులు, కిడ్నీలలో ఇన్ఫెక్షన్ కారణంగా విశాఖపట్నంలోని మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మూఢ నమ్మకాల నిర్మూలనే ప్రధాన ఆశయంగా 1972లో భారత నాస్తిక సమాజాన్ని స్థాపించారు. తరువాత అనుబంధ సంస్థగా సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఆంధ్ర పెరియార్‌గా జయగోపాల్ పేరొందారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై భారత నాస్తిక సమాజం నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చెందుతున్నారు.

4న ఎన్‌జేసీఎస్ సమావేశం

ఉక్కునగరం: ఉక్కు పరిశ్రమకు చెందిన నేషనల్ జాయింట్ కమిటీ ఫర్ ది స్టీల్ ఇండస్ట్రీ సమావేశం జనవరి 4న నిర్వహించనున్నారు. న్యూఢిల్లీలో ఆరోజు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని ఎన్‌జేసీఎస్ కన్వీనర్, సెయిల్ డైరెక్టర్ (పర్సనల్) కె.కె. సింగ్ కోరారు.

విశాఖ-రాయగడ పాసింజర్ స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం: స్థానికప్రజల డిమాండ్ మేరకు విశాఖ-రాయగడ-విశాఖ మధ్య నడుస్తున్న పాసింజర్ స్పెషల్‌ను భవానీపట్న వరకు పొడిగించేందుకు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే నిర్ణయించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-రాయగడ(08504)పాసింజర్ స్పెషల్ ఈ నెల 27వ తేదీ నుంచి, తిరుగు ప్రయాణంలో రాయగడ-విశాఖ (08503) పాసింజర్ స్పెషల్ ఈ నెల 28వ తేదీ నుంచి భవానీపట్న వరకు పొడిగించారు. ఆయా తేదీల నుంచి ఈ రైలు భవానీపట్న-రాయగడ-విశాఖ మధ్య రాకపోకలు సాగిస్తాయి. రాయగడ-భవానీపట్న మధ్య సింగపూర్ రోడ్, తెరుబలి, బిసంకటక్, మునిగుడ, డోయ్‌కలు, అంబాడోల, లంజీఘడ్ రోడ్, జి రామచంద్రపూర్, దేఫూర్ స్టేషన్‌లలో ఈ రైళ్లు ఆగుతాయి.

ఉపాధి కల్పనలో ఏపీ నంబర్ వన్

- నైపుణ్యాభివృద్ధి శిక్షణలో ఏపీ మూడో స్థానం
- సీడాప్ ద్వారా నాలుగేళ్లలో 46 వేల మందికి ఉపాధి
- ఘనంగా సీడాప్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



విద్యార్థుల నృత్య ప్రదర్శన


సీఎం జగన్ జన్మదినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మేయర్, ఎమ్మెల్యేలు

బీచ్‌రోడ్డు: ఉపాధి కల్పనలో దేశంలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని మేయర్ గొలగాని హరివెంకట కుమారి, రాష్ట్ర ప్రభుత్వ స్కిల్స్, శిక్షణ సలహాదారు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్), దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన, సాగరమాలలో శిక్షణ పొందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఏరీనాలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీడాప్ ద్వారా గడిచిన నాలుగేళ్లలో 64 వేల మందికి శిక్షణ ఇస్తే.. వారిలో 46 వేల మంది ఉపాధి పొందినట్లు చెప్పారు. నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడంలో సీడాప్ దేశంలోనే తొలి స్థానంలో ఉందన్నారు. శిక్షణ ఇవ్వడంలో మూడో స్థానంలో నిలవడం హర్షణీయన్నారు. దూరదృష్టితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచిస్తున్నారని.. ఆయన ఆలోచనలకు తగిన విధంగా శిక్షణ పొందిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పి.అజయ్‌రెడ్డి మాట్లాడుతూ విద్య పూర్తి చేసి నైపుణ్యం కోసం వచ్చిన వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే బాధ్యతను సీడాప్ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. సీడాప్ చైర్మన్ ఎస్.శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసిన వారు.. తమ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఇక్కడ అందిస్తున్న శిక్షణ గురించి తెలియజేయాలన్నారు. సీడాప్ సీఈవో ఎం.కె.వి. శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సూచనలతో యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రస్తుతం శిక్షణ పొందుతున్న విద్యార్థులు డ్యాన్స్‌లు, పాటలు, స్కిట్లతో అలరించారు. ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి రాజీవ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ బర్త్ డే సీఎం సర్

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మేయర్ భారీ కేక్‌ను కట్ చేసి అతిథులకు పంచిపెట్టారు. చిల్డ్రన్ ఎరీనా ప్రాంగణం 'హ్యాపీ బర్త్ డే సీఎం సర్' అనే నినాదాలతో మార్మోగింది.

మేనేజర్‌గా నియమించారు



సీడాప్ ద్వారా సోలార్ ప్యానెల్ ఇన్‌స్టాలేషన్‌లో శిక్షణ పొందాను. ఆ తర్వాత ఐఐఎఫ్ఎల్ సంస్థలో ఉద్యోగం కల్పించారు. నా నైపుణ్యాన్ని గుర్తించిన సంస్థ అతి తక్కువ సమయంలోనే టీం లీడర్‌ను చేసింది. టీం లీడర్‌గా మంచి పనితీరు కనబరచడంతో నా సొంతూరు అనకాపల్లిలో ఐఐఎఫ్ఎల్ సంస్థ మేనేజర్‌గా నియమించింది. త్వరలో మేనేజర్‌గా విధులు చేపట్టనున్నాను. నా మొదటి జీతం నెలకు రూ.16 వేలు. ఇప్పుడు రూ.40 వేలు సంపాదిస్తున్నాను. నేను, నా కుటుంబం చాలా సంతోషంగా ఉన్నాం. సీడాప్‌కు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– పి.జయప్రకాశ్, అనకాపల్లి

సీఎం ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు



డిగ్రీ పూర్తి చేసిన వెంటనే ఎచ్చెర్ల వద్ద ఉన్న సీడాప్ శిక్షణ కేంద్రంలో టెక్స్‌టైల్స్‌లో శిక్షణ పొందాను. తర్వాత హైదరాబాద్‌లోని తనిష్క్ షాపింగ్ మాల్‌లో సేల్స్ అధికారిగా ఉద్యోగం కల్పించారు. నా మొదటి జీతం రూ.18 వేలు. ఆ మొత్తంతో అమ్మకు పట్టుచీర కొన్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు నైపుణ్యాలు అభివృద్ధి చేసి.. ఉపాధి కల్పించేలా సీడాప్‌ను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు.

– శ్యామ్ సుందర్, శ్రీకాకుళం

మూడు నెలల్లో ఉద్యోగం



డిగ్రీ పూర్తయిన వెంటనే శీలానగర్‌లోని సీడాప్‌లో బీపీవోలో శిక్షణ పొందాను. మూడు నెలల శిక్షణ అనంతరం బెంగళూరులోని కోజెంట్ సంస్థలో ఉద్యోగం లభించింది. చదువు పూర్తయిన మూడు నెలలకే ఉద్యోగం రావడంతో మా అమ్మానాన్న చాలా సంతోషించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి పెంపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవ ప్రశంసనీయం.

– పి.మానస, గాజువాక

వృత్తి మెకానిజం... చేసేది చైన్‌స్నాచింగ్

- పాత నేరస్తుడిని అరెస్ట్ చేసిన ఆరిలోవ పోలీసులు
- నాలుగు బైక్‌లు, 4 తులాల బంగారం స్వాధీనం


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు

అల్లిపురం: వృత్తి మోటార్ మెకానిక్ పని, చేసేది మాత్రం చైన్ స్నాచింగ్‌లు, బైక్‌ల దొంగతనాలు. మోటారు సైకిళ్లు దొంగతనం చేసి... వాటి నంబర్ ప్లేట్లు మార్చి... ఆ బైక్‌లపై వెళ్తూ మహిళల మెడలోని బంగారు చైన్లు తెంపుకుపోతున్న వ్యక్తిని ఆరిలోవ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని నుంచి 4 బైక్‌లు, 4 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నగర క్రైం ఏడీసీపీ డి.గంగాధరం నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం వివరాలు వెల్లడించారు. కేఆర్ఎం కాలనీకి చెందిన గుత్తుల లలిత భర్త, కూతురు ఒక బైక్ పైన, తల్లితో కలిసి ఆమె ఒక స్కూటీపై ఈ నెల 9న ఉదయం అడివివరం కాలభైరవ స్వామి గుడికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పెదగదిలి సాయిబాబా గుడి వద్దకు వచ్చే సమయంలో వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలోని నల్లపూసల దండ తెంపుకుని వెళ్లిపోయాడు. దీంతో ఆమె తన భర్తతో కలిసి ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో క్రైం ఏసీపీ సీసీఎస్ ఎ.వెంకటరావు, ద్వారకాసబ్ డివిజన్, క్రైం సీఐ టి.ఇమ్మానుయేల్ రాజు, ఆరిలోవ క్రైం ఎస్ఐ ఎల్.మురళీకృష్ణ బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేశారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి నిందితుడిని గుర్తించారు. నిందితుడు కంచరపాలెం, ఊర్వశి జంక్షన్ ప్రాంతానికి చెందిన భీమరశెట్టి కమల్‌నాథ్ అలియాస్ అర్కేగా గుర్తించారు. ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద పార్కు చేసిన బైక్‌ను అపహరించి చైన్‌స్నాచింగ్‌కు వినియోగించాడు. ఆ బైక్ నంబర్ ప్లేట్ తొలగించి, తాను నివసిస్తున్న సుభాష్‌నగర్‌లోని ఓ వ్యక్తి బైక్ నంబరు తగిలించి చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడని తెలిపారు. దీంతో నిందితుడుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నిందితుడిపై మూడు జిల్లాల్లో కేసులు

నిందితుడు భీమరశెట్టి కమల్‌నాథ్‌పై విశాఖపట్నం జిల్లా కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 3, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 2 కేసులు ఉన్నట్లు గుర్తించారు. విజయగనరం జిల్లా లొట్లపల్లి, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కోలా అరుణకుమారి ఈ ఏడాది నవంబర్ 3న ఉదయం స్కూల్‌కు స్కూటీపై వెళ్తుండగా అలమండ రైల్వే స్టేషన్ వద్ద నిందితుడు వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోని చైన్ అపహరించుకుపోయాడు.

- అక్టోబర్ 12న కొత్తవలస ములగపాకవానిపాలేనికి చెందిన తెడ్డాపు లీలాకుమారి బ్యాంకుకు వెళ్లి స్కూటీపై వస్తుండగా తుమ్మికాపల్లి వద్ద బైక్‌పై వచ్చి ఆమె మెడలోని చైన్ దొంగిలించుకుపోయాడు.
- గత నవంబర్ 6న డొంకాడ, రఘుమండకు చెందిన గూడేల సీతారత్నం నడుచుకుంటూ వైఎస్సార్ కాలనీకి వెళ్తుండగా రఘుమండ వద్ద కమల్‌నాథ్ బైక్‌పై వచ్చి ఆమె మెడలోని పుస్తెల తాడు తెంపుకుని వెళ్లిపోయాడు.
- ఈ ఏడాది దసరా రోజున సుబ్బవరం వద్ద స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలోని బంగారు చైన్ తెంపుకుని వెళ్లిపోయాడు.
- అక్టోబర్ 22న భగత్‌సింగ్ నగర్‌కు చెందిన కర్రి రవికిశోర్ ఇంటి వద్ద నిలిపిన స్కూటీని దొంగలించుకుపోయాడు.
- అనపర్తిలో రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్‌ను కమల్‌నాథ్ దొంగిలించుకుని వెళ్లిపోయాడు.

చిన్నారుల భద్రతకు సమష్టి కృషి

నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్


మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

ఏయూక్యాంపస్: చిన్నారుల భద్రతకు సమష్టిగా పనిచేయాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ సూచించారు. పోక్సో చట్టంపై ఏయూ న్యాయ కళాశాల, విశాఖ పోలీసు శాఖ సంయుక్తంగా నిర్వహించిన మూట్ కోర్టు ప్రజెంటేషన్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. యువతతో కలిసి పని చేస్తామని, భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామని తెలిపారు. న్యాయ విద్యార్థులు సామాజిక బాధ్యతతో నడచుకోవాలని సూచించారు. నేటి తరం కార్పొరేట్ కొలువులపై ఆసక్తి చూపుతోందని, అదే సమయంలో పేదలకు, ఆపన్నులకు సేవ చేయడంలో కలిగే సంతృప్తి ఎంతో విలువైనదనే విషయం తెలుసుకోవాలని అన్నారు.

ఆధారాల సేకరణ కీలకం

చిన్నారులపై జరిగే లైంగిక దాడుల సంఘటనల్లో అవసరమైన ఆధారాల సేకరణ, న్యాయస్థానాల్లో రుజువు చేయడం, నిందితులకు శిక్ష పడే విధంగా చేయడం ఎంతో అవసరమన్నారు. పోలీసుల బాధ్యతలు పెరిగిపోతున్నాయని, అయినా వారు ఎంతో పటిష్టంగా విచారణ జరిపి, సాక్ష్యాధారాలను సేకరించి విచారణ వేగవంతంగా పూర్తి చేస్తున్నారని చెప్పారు. యువతలో చైతన్యం పెంచే విధంగా ఇటువంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, తద్వారా వ్యవస్థను మరింత మెరుగుపరచవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆచార్య ఎస్.సుమిత్ర, ఆచార్య రాజ్యలక్ష్మి, ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు ప్రసంగించారు. అనంతరం వివిధ సంఘటనలపై న్యాయస్థానాలలో జరిగే వాదనల నమూనా (మూట్ కోర్ట్) విధానాన్ని ఏయూ న్యాయ కళాశాల విద్యార్థులు ప్రత్యక్షంగా చేసి చూపారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, ఏయూ సిబ్బంది, న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నడి సంద్రంలో తప్పిన పెను ప్రమాదం


రుషికొండ బీచ్‌లో ఢీకొట్టిన రెండు స్పీడ్ బోట్లు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో నడి సంద్రంలో పెనుప్రమాదం తప్పింది. పర్యాటకులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీ టూరిజం నిర్వహిస్తున్న స్పీడ్ బోటులో 8 మంది పర్యాటకులు గురువారం సాయంత్రం బోటు షికారుకు వెళ్లారు. అదే సమయంలో ఓ ప్రైవేటు బోటులో ఐదుగురు షికారుకు వెళ్లారు. ఈ క్రమంలో అతి వేగంగా వస్తున్న ప్రైవేటు స్పీడ్ బోటు ఏపీటీడీసీ స్పీడ్ బోటును బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో ప్రైవేటు బోటు పూర్తిగా టూరిజం బోటు క్రిందకు చొచ్చుకుని పోవడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు పర్యాటకులు ఒక్కసారిగా సముద్రంలో పడిపోయారు. అయితే వీరు లైఫ్ జాకెట్ల సహాయంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విశాఖ చేరుకున్న మాదక ద్రవ్యాల నిరోధక బృందం


మేయర్ హరివెంకటకుమారిని మర్యాదపూర్వకంగా కలిసిన బృంద సభ్యులు

డాబాగార్డెన్స్: సింహాద్రి టీఎంటీ, హిమా హ్యూమానిటేరిన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 29న చేపట్టిన మాదకద్రవ్యాల నిరోధక కార్ ర్యాలీ తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ మీదుగా గురువారం విశాఖ చేరుకుంది. ఈ సందర్భంగా ర్యాలీ బృందం మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని మర్యాద పూర్వకంగా కలిసింది. దారి పొడవునా కళాశాల విద్యార్థులకు చేపట్టిన అవగాహన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా బృందానికి మేయర్ జ్ఞాపిక బహూకరించారు. హిమా హ్యూమానిటేరియన్ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఆయా భాషల్లో ముద్రించిన కరపత్రాలు విద్యార్థులకు అందజేసి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించినట్టు తెలిపారు.

ప్రయాణికుడి బ్యాగ్ అప్పగింత

తాటిచెట్లపాలెం: రైలులో మరిచిపోయిన నగదుతో కూడిన బ్యాగును రైల్వే పోలీసులు ప్రయాణికుడి అప్పగించారు. జీఆర్పీ తెలిపిన వివరాల ప్రకారం ...హైదరాబాద్ కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన చుండూరి సీతారామశాస్త్రి గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎ-1 కోచ్‌లో గురువారం సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకున్నారు. ఈ క్రమంలో రైలులో రూ.2 లక్షలతో కూడిన బ్యాగును రైలులో మరిచిపోయాడు. విషయం తెలుసుకుని వెంటనే గవర్నమెంట్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా విశాఖపట్నం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది కోచ్ అటెండెంట్ బి.రఘుపతి సాయంతో ప్రయాణికుడు పోగొట్టుకున్న బ్యాగును కనుగొని అప్పగించారు.

నేడు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

విశాఖ విద్య: జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ శుక్రవారం వేపగుంట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు డీఎస్‌వో కప్పాల ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఓవరాల్ చాంపియన్స్ వీరే


ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న భీమిలి పాలిటెక్నిక్ కాలేజీ బాలికలు

మురళీనగర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రాంతీయ అంతర పాలిటెక్నిక్ క్రీడా పోటీల్లో బాలికల విభాగంలో భీమిలి బాలికల ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, బాలుర విభాగంలో గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచారు. పోటా పోటీగా సాగిన ఈ పోటీలు గురువారం ముగిశాయి. బాలికల విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్ ట్రోఫీని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ నుంచి ఆర్.షమిత, సాయిగణపతి కాలేజీ నుంచి ఎస్.మల్లేశ్వరి కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను ఎం.ధర్మేశ్వర్ సాధించారు. బాలుర గేమ్స్ చాంపియన్‌షిప్‌ను కొంకోటలోని ది రాజీవ్‌గాంధీ ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కాలేజీ, విశాఖలోని ఏవీఎన్ పాలిటెక్నిక్ కాలేజీలు సంయుక్తంగా గెలుచుకున్నాయి. గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన గురువారం సాయంత్రం నిర్వహించారు. ముగింపు సమావేశంలో రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీయూఎం ప్రసాద్, ఐఐపీఈ మాజీ డైరెక్టర్ ఆచార్య వీఎస్‌కే ప్రసాద్, ప్రముఖ క్రీడాకారుడు, వెటరన్ ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలు విజేతలకు ట్రోఫీలు అందించారు. సమావేశంలో పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ జీఎస్ఎన్ మూర్తి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

- 96 సంస్థల స్టాళ్లు, 300 ప్రాజెక్టుల ఏర్పాటు
- నగర వాసుల సొంతింటి కల సాకారానికి సేవలు


మాట్లాడుతున్న చైర్మన్ రాజు తదితరులు

ఎంవీపీ కాలనీ: నగర వాసుల సొంతింటి కల సాకారం చేసే దిశగా 9వ క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు శివాజీపార్కు దరి ఎంవీపీ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎక్స్‌పో వివరాలను క్రెడాయ్ సంస్థ చైర్మన్ కేఎస్ఆర్‌కే రాజు, ప్రెసిడెంట్ వి.ధర్మేందర్ వెల్లడించారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా ఈ ప్రాపర్టీ ఎక్స్‌పో మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. శనివారం మధ్యాహ్నం ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో పాటు మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, తదితరులు హాజరు కానున్నారన్నారు. 96 సంస్థల స్టాళ్లతో పాటు 300 ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్‌పోలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వినియోగదారులకు ఆయా సంస్థలు రూ.లక్ష (3 నెలల కాలవ్యవధిలో ప్లాట్ కొనుగోలుపై) రాయితీ ఇస్తాయన్నారు. సందర్శకులకు డ్రా ద్వారా ప్రతిరోజు 5 గ్రాముల గోల్డ్ కాయిన్ కూడా అందజేయడంతో పాటు బంఫర్ డ్రా ద్వారా ద్విచక్ర వాహనాన్ని బహూకరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

3 అంశాల్లో అవగాహన

ఈ ఎక్స్‌పోలో భాగంగా మూడు అంశాలపై వినియోగదారులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 24న ఉదయం ప్రభుత్వం నగరాభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులు, రోడ్ల ఆధునీకీకరణ, సుందరీకరణ, వాటి ద్వారా ప్రజలకు జరిగే మేలును జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అవగాహన కల్పిస్తారన్నారు. మధ్యాహ్నం కార్యక్రమంలో ఎస్‌బీఐ రుణాలు, రాయితీలు, వినియోగం, ఈఎంఐ చార్జెస్‌పై వినియోగదారులకు ఆ సంస్థ ఉన్నతాధికారులు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 25న ఉదయం కాలుష్యం- వాతావరణం, పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ బిల్డింగ్స్ నిర్మాణం అంశాలపై ఐజీబీసీ ఉన్నతాధికారులు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సాయంత్రం జరిగే ముంగింపు కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ అతిథులుగా పాల్గొంటారన్నారు.